క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.5లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న శంభీపూర్ కృష్ణ

దుండిగల్: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. దుండిగల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీరాజరాజేశ్వరి, పోచమ్మ ఆలయ నిర్మాణ పనులకు రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శంభీపూర్ కృష్ణ మాట్లాడుతూ ఆలయ నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తి చేస్తి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆలయ కమిటీని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలరు కృష్ణయాదవ్, అనంత స్వామి, సాయియాదవ్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, శివనూరి మల్లేశ్, నల్తూరి కృష్ణ, శ్రీనివాస్, బండారి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం

నిజాంపేట్: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించే దిశగా పని చేస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని కావ్యా ఎవెన్యూలో రూ.25 లక్షలతో చేపట్టన్ను భూగర్భ డ్రైనేజీ పనులను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం కాలనీలో పర్యటించగా ఇటీవల కురుస్తున్న వర్షాలతో రోడ్లపై గుంతలు పడటంతో మట్టి పోయించి జేసీబీతో చదును చేయించారు.

◆ అనంతరం వీరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సమస్యలను వెనువెంటనే పరిష్కరిస్తున్నామని అన్నారు. డివిజన్ పరిధిలో మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పిస్తున్నామని అన్నారు. కాలనీ అధ్యక్షులు విజయ్‌కుమార్, సభ్యులు ప్రసన్న బాబు, రామకృష్ణ, శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు రమేష్, నరేష్, నాయకులు శ్రీధర్ రెడ్డి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

బ్రదర్ అనిల్‌కుమార్‌ను కలిసిన వైఎస్సార్‌టీపీ నాయకులు



బ్రదర్ అనిల్‌కుమార్‌ను కలిసిన సంజీవరావు, సాతాల గోపాల్

కుత్బుల్లాపూర్: వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల భర్త బ్రదర్ అనిల్‌కుమార్‌ను బుధవారం వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంజీవరావు, కుత్బుల్లాపూర్ కోఆర్డినేటర్ సాతాల గోపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాతాల గోపాల్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వైఎస్సార్‌టీపీ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను తెలంగాణ ప్రజలు ఇంకా మరువలేదన్నారు.

కంటైనర్‌కు తగిలి తెగిపడిన విద్యుత్ తీగలు



సుభాష్‌నగర్: ట్రాక్టర్ల లోడుతో వెళ్తున్న ఒక కంటైనర్ విద్యుత్ వైర్ తెగ్గొట్టిన ఘటన దూలపల్లిలో చోటుచేసుకుంది. కంటైనర్ బుధవారం ట్రాక్టర్ల లోడుతో దూలపల్లి నుంచి కరీంనగర్ వైపు వెళ్తుంది. దూలపల్లిలోని సెయింట్ మార్టిన్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద బ్రిడ్జ్ పనులు జరుగుతుండటంతో రోడ్డు పక్క నుంచి మరో దారి గుండా కంటైనర్‌ను పోనిచ్చారు. ఈ క్రమంలో కంటైనర్‌కు విద్యుత్ తీగలు తగిలి తెగిపోయాయి. దీంతో వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ క్లీనర్ త్రుటిలో తప్పించుకున్నారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడి చేరుకుని విద్యుత్ సిబ్బంది సహాయంతో విద్యుత్ వైర్లను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

తగ్గింపు ధరలకు బ్రాండెడ్ దుస్తులు



సాక్షి సిటీబ్యూరో: నిజాంపేట్ కొలన్ నారాయణరెడ్డి గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో లగ్జరీ బ్రాండెడ్ దుస్తులను భారీ తగ్గింపు ధరలకు విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులు, మహిళలు, పిల్లల పలు రకాల దుస్తులు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు విక్రయాలు కొనసాగుతాయని తెలిపారు. మరో 4రోజులు మాత్రమే అమ్మకాలు ఉంటాయని తెలిపారు.

పర్యవేక్షణ పైపైకి.. నిర్వహణ గాలికి.!



పార్కు స్థలాల్లో ప్రకృతి వనాలు





సర్వేపల్లి రాధాకృష్ణ పార్కులోని ఓపెన్ జిమ్ పరికరాల దుస్థితి

పార్కులపై పర్యవేక్షణ లేదు..? పార్కుల అభివృద్ధిలో చిత్తశుద్ధి ఎక్కడ..? ఓపెన్ జిమ్‌ల మరమ్మతులు మరిచారు. పలుమార్లు ఆయా కాలనీల ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. సేద తీరేందుకు, పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన పార్కుల పట్ల అధికారులకు ఇంత నిర్లక్ష్యం ఏమిటని ఆవేదన చెందుతున్నారు.

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్, బాచుపల్లి,నిజాంపేట్ ప్రాంతాల్లోని 33 వార్డుల్లోని 114 పార్కులకు గాను 90 శాతం పార్కుల్లో అభివృద్ధి పూనులు పూర్తి కాలేదు. కొన్నింటిలో ఇంకా ఎలాంటి పనులు ప్రారంభిక పోవడంతో నిరుపయోగంగా మారాయి. పనులు ప్రారంభించిన పార్కుల్లో లక్షలాది నిధులు వెచ్చించి పనులు ప్రారంభించిన పూర్తి స్థాయిలో పూర్తికాక.. పూర్తియిన పనులు సైతం పాడైపోతున్నాయి. ఈ విషయం ప్రజలు పలుమార్లు అధికారులు, కార్పొరేటర్లకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతుందని స్థానికులు వాపోతున్నారు.

◆ నిజాంపేట్ మున్సిపల్ పరిధిలోనే ప్రగతినగర్‌లోనే ఏకంగా 52 పార్కులు ఉన్నాయి. అందులో గతంలో గ్రామ పంచాయతీగా పాలనలోనే అభివృద్ధి జరిగిన పార్కులు తప్ప మున్సిపల్‌గా మారిన తరువాత పూర్తి అభివృద్ధి జరిగిన పార్కులు లేవవే ప్రజలు పేర్కొనడం విశేషం. అభివృద్ధి పనులు ప్రారంభించి పనులు పూర్తి కాక అసంపూర్తిగా మిగిలి ఉన్న పార్కులే ఎక్కువగా ఉండటం గమనార్హం.

ఓపెన్ జిమ్‌లను గాలికొదిలేసిన అధికారులు....

పార్కుల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను అధికారులు గాలికొదిలేశారనే విమర్శలు సర్వత్ర వినిపిస్తున్నాయి. ప్రగతినగర్, నిజాంపేట్, బాచుపల్లి ప్రాంతాల్లోని వార్డుల్లో పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రజలు ,పిల్లలు వ్యాయామం చేసే క్రమంలో రిపేర్లు అవసరం అవుతాయనే పరిజ్ఞానం కూడా అధికారులకు లేకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు, పార్కుల పరిస్థితిని సమీక్షించే సమయం అధికారులు, మేయర్, కార్పొరేటర్లకు లేదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

◆ ఉదాహరణకు ప్రగతినగర్‌లోని వాసవీ లేవుట్‌లో ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణ పార్కులో ఏడాది క్రితం ప్రారంభించిన అభివృద్ధి పనులు అసంపూర్తిగానే మిగిలాయి. అరకొర పనులు పూర్తి చేసి చేతులు దులుపుకున్నారు.ఇక ఓపెన్ జిమ్‌లోని అనేక పరికారాలు రిపేర్‌కు వచ్చి సంవత్సర కాలం పూర్తయిన ఇప్పటి వరకు వాటిని రిపేర్ చేసే పరిస్థితి లేదు. ఆ పార్కు బోర్డు సైతం కింద పడిపోయి సంవత్సరం పైగానే అయ్యింది. అయిన కనీసం అటు వైపు తొంగి చూసే పరిస్థితి లేదు.

పార్కులను ప్రకృతి వనాలుగా మర్చడం ఎందుకు..?

ఉదయం సాయంత్రం వేళల్లో ప్రజలు వాకింగ్ చేసుకోవడానికి, పిల్లలు ఆడుకోవడానికి వృద్ధులు, మహిళలు సేదతీరడానికి పార్కులను అభివృద్ధి చేయాల్సింది పోయి అధికారులు పార్కుల్లో మొత్తం మొక్కలు నాటడం ఏమిటని వివిధ కాలనీల వాసులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటాలి కదా అని పార్కులను ప్రకృతి వనాలు చేస్తే పార్కుల్లోకి ప్రజలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. మొక్కలు నాటడానికి రోడ్ల పక్కన, పార్కుల్లో అంచులకు, ప్రభుత్వ స్థలాల్లో, ఇలా నాటాల్సింది పోయి పార్కుల్లో నాటుతుండటంతో అధికారుల తీరుపై అనేక విమర్శలు వస్తున్నాయి.





పార్కులను పట్టించుకోవడం లేదు..

పార్కుల అభివృద్ధిని అధికారులు అస్సలు పట్టించుకోవడం లేదు.పార్కుల పరిస్థితిపై కనీసం రివ్యూ చేయలేకపోవడం అధికారుల చిత్తశుద్ధి కనిపిస్తుంది. కార్పొరేషన్ సిబ్బంది, అధికారులు ఏమి చేస్తున్నారు. కాంట్రాక్టలకు పనులు అప్పగించి కూర్చోవడమేనా.. పనులు ఎలా జరుగుతున్నాయి. వాటి పరిస్థితి ఏంటో పట్టించుకోవాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నిస్తున్నారు.

నిర్వహణ అస్సలు లేదు....



ఓపెన్ జిమ్‌లు అంటేనే తొందరగా రిపేర్లకు వస్తాయన్న విషయం అధికారులకు తెలియాదా? ఏర్పాటు చేసి సంవత్సరాలు గడుస్తున్నా అవి ఎలా ఉన్నాయి. ఎలా పని చేస్తున్నాయి అని పరిశీలించే తిరిక అధికారులకు లేదా? జిమ్ పరికారలు కొన్ని విరిగిపోతున్నా పట్టించుకునే వారు లేదు. విరిగిపోయి కింద పడిపోయిన వాటిని రాత్రి సమయాల్లో చోరీకి గురవుతున్నాయి.

– రామ్‌మోహన్

పార్కులను అభివృద్ధి చేయాలి...



పార్కులను వేగవంతంగా అభివృద్ధి పరిచి వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉండకూడదు. పిల్లలు ఆడుకునే పరికరాలు సైతం అనేక పార్కుల్లో పాడైపోయి మరమ్మతులు అవసరం ఉన్నాయి. వీటిని గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలి. అదే విధంగా ప్రతి పార్కులో తప్పనిసరిగా మూత్రశాలలు ఏర్పాటు చేయాలి.

– జిలగం చంద్రయ్య

పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వాలి



పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళుల్పిస్తున్న శ్రీగాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

సుభాష్‌నగర్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశప్రధానిగా ప్రజల గుండెల్లో పీవీ నరసింహారావు చిరస్థాయిగా నిలిచిపోయారని శ్రీగాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమాచార్యులు అన్నారు. పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకుని బుధవారం శ్రీగాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణమాచార్యులు మాట్లాడుతూ.. ఆర్థిక సంస్కరణలతో ధీనావస్థలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ఘనత పీవీకే దక్కుతుందన్నారు. అపర చాణక్యుడు, బహుభాషా కోవిదుడైన ఆయనకు భారతరత్న ఇవ్వాలన్నారు. సంఘం ముఖ్య సలహాదారులు సర్వేపల్లి రమేష్ కుమార్, గడ్డం రాంబాబు, చక్రధారి శ్రీరామ శర్మ, రాచపూడి ప్రభాకర్, హరి రాఘవేంద్ర, సింహాచలం శ్రీధరాచార్యులు, సుబ్రహ్మణ్యం, రుద్రావర్జుల సంజీవరావు, ఉయ్యాలవాడ గంగాధర్ శర్మ, కోటేశ్వరరావు, సూర్యనారాయణ, గురజాడ రంగారావు, మిర్యాల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చలేదు'



బాచుపలిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి

నిజాంపేట్: తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. మహా జన సంపర్క్ అభియాన్‌లో భాగంగా బుధవారం ఆయన నిజాంపేట్ కార్పొరేటర్ పరిధి బాచుపల్లిలో గడపగడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. మరో పక్క రాష్ట్రంలో కేసీఆర్ తన కుటుంబ శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం నేటికి ఎన్నికల హామీలను నెరవేర్చలేదన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకు వెంటనే పంపిణీ చేయాలన్నారు. బీజేపీ నాయకులు సుహాసిని, మురళీధర్ బాబు, అతిష్ బాబు, లక్ష్మారెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

జీడిమెట్ల: ఎర్‌ఆర్‌నాయక్ నగర్ మోడీ అపార్ట్‌మెంట్స్‌కు చెందిన చంద్రశేఖర్, నాగలక్ష్మి(32) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో చంద్రశేఖర్ పని చేస్తుండగా నాగలక్ష్మి ఇంటి వద్దనే ఉంటోంది. కాగా బుధవారం ఉదయం భర్త విధులకు వెళ్లగా, పిల్లలు స్కూల్‌కు వెళ్లి సాయంత్రంగా ఇంటికి తిరిగి రాగా తల్లి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఆర్థిక సమస్యలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి కుటుంబీకులు చెబుతున్నారు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన వైద్య సేవలందించే దిశగా పని చేయాలి

కుత్బుల్లాపూర్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించే దిశగా ఆశావర్కర్లు పని చేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. షాపూర్‌నగర్ యూపీహెచ్‌సీలో నూతనంగా నియామకమైన 20 మంది ఆశావర్కర్లు బుధవారం డాక్టర్ నవనీత ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆశావర్కర్లకు అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కరోనా సమయంలో ఆశావర్కర్లు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి రోగులకు సేవలందించారని అదే స్ఫూర్తితో పని చేయాలన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌ను కలిసిన ఆశావర్కర్లు, డాక్టర్ సునీత

లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ

దుండిగల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ దఫా దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దుండిగల్ గ్రామంలో 11 యూనిట్లు, డి.పోచంపల్లిలో 4 యూనిట్లను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఒక్కో యూనిట్‌కు 20 గొర్రెలు, ఒక పొటెలును అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శేఖర్, సహాయ సంచాలకులు మల్లికార్జున్, వెటర్నరీ అధికారి శైలజ, జక్కుల శ్రీనివాస్, కౌన్సిలర్ జక్కుల కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

జీడిమెట్ల: ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా ఓ బాలిక వెళ్లిపోయిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్‌రెడ్డి వివరాల ప్రకారం.. భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన నర్సింహ, శివనీలకు కుమార్తె ప్రతిభ వర్ష ఉంది. బాలిక స్థానికంగా ఉన్న పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈ నెల 26వ తేదీన బాలిక తల్లిదండ్రులు పని నిమిత్తం బయటకు వెళ్లినారు. తిరిగి సాయంత్రం వచ్చి చూసూసరికి బాలిక ఇంట్లో కనిపించలేదు. చుట్టు పక్కల, స్నేహితుల వద్ద వాకబు చేసిన ఫలితం లేకపోయింది. బాలిక తల్లి శివలీల బుధవారం జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం

సుభాష్‌నగర్: ఇంటి నుంచిబయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ శివాలయనగర్‌కు చెందిన లక్ష్మి (58) ఈ నెల 27న సాయంత్రం 6 గంటల సమయంలో బయటకు వెళ్లింది. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆమె కుమారుడు ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలి



అభివృద్ధి పనులపై సమావేశమైన మేయర్ నీలారెడ్డి, కార్పొరేటర్లు

నిజాంపేట్: వర్షాకాలం దృష్ట్యా అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ స్వతంత్ర కార్పొరేటర్లతో వివిధ సమస్యలపై మేయర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పనులపై దృష్టి సారించి పూర్తి చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో డ్రైనేజీ లైన్‌లు, నాలా నిర్మాణ పనులతో పాటు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా రోడ్ల పనులను చేపట్టాలని సూచించారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. పురాతన భవనాలను గుర్తించి వాటిని తొలగించాలని ఆదేశించారు. కార్పొరేటర్లు చిట్ల దివాకర్, బాలాజీ నాయక్, ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అభిషేక్‌రెడ్డి, స్వతంత్ర కార్పొరేటర్లు వెంకట రామయ్య, శ్రీరాములు, సుజాత, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

నిజాంపేట్: బాచుపల్లిలోని ఎస్ఎల్‌జీ ఆస్పత్రిలో ఈనెల 30న ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీఎస్ సోమరాజు ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ శిబిరంలో గ్యాస్ట్రో ఎంటరాలజీకి సంబంధించిన ఉచిత కన్సల్టేషన్ అందించడంతో పాటు, వైద్యులు సూచించిన అన్నిరకాల వైద్య పరీక్షలపై 50% రాయితీ ఇస్తామన్నారు. గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ బీవీఎస్ కుమార్ సూరెడ్డి ఈ శిబిరంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. కామెర్లు, మలబద్ధకం, మలంలో రక్తం పడటం, కడుపునొప్పి, కారణం తెలియకుండా బరువు తగ్గిపోవడం, రక్తహీనత లాంటి వాటన్నింటికీ ఉదర సంబంధిత పరీక్షలు చేస్తారు.శిబిరంలో పాల్గొనాలనుకునే వారు ముందస్తుగా 040-23785678 / 7799235678 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

సమస్యల సాధనకు జర్నలిస్టులంతా ఏకతాటిపైకి రావాలి



మాట్లాడుతున్న మాదిగ జర్నలిస్టు ఫోరం సలహాదారులు జాతీయ నాయకుడు లక్ష్మణ్‌మాదిగ

కుత్బుల్లాపూర్: మాదిగ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశాన్ని జయప్రదం చేయాలని మాదిగ జర్నలిస్టు ఫోరం సలహాదారులు జాతీయ నాయకుడు తిప్పారపు లక్ష్మణ్‌మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన సూరారంలోని వీబీసీ ఫంక్షన్‌హాల్‌లో సందర్శించి సమావేశ వేదికను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి డప్పు రామస్వామి, రాష్ట్ర అధ్యక్షులు అశోక్, జిల్లా అధ్యక్షులు ఎర్ర యాకన్నలతో కలిసి మీడియా సమావేశంలో లక్ష్మణ్‌మాదిగ మాట్లాడారు.

◆ తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వాటి పరిష్కార సాధన కోసం జర్నలిస్టులంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సుంచు అశోక్‌మాదిగ, రాష్ట్ర కార్యదర్శి ఎర్ర యాకన్న, కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు జోగు వెంకట్, ఎమ్మార్పీఎస్ నాయకుడు మల్లేష్ మాదిగ, జర్నలిస్ట్ నాయకులు తోకల చిరంజీవి, భిక్షపతి, ఎర్రోళ్ల బాబు, శ్రీశైలం, దేవేందర్, స్వామి, రాము, ఆనంద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అవినీతి పాలనతో ప్రజలు విసుగు చెందారు

బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్



సంజయ్‌గాంధీనగర్‌లో నెలకొన్న సమస్యలను వింటున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్



అవ్వను ఆప్యాయంగా పలకరిస్తున్న శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలంగాణ ప్రజల దరి చేరకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుంటోందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ గోస – శ్రీశైలం అన్న భరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం సూరారం పరిధిలోని సంజయ్‌గాంధీనగర్ ఆయన పాదయాత్ర చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు ఇప్పించాలన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను స్థానికులు శ్రీశైలంగౌడ్ దృష్టికి తీసుకువచ్చారు.

◆ ఈ సందర్భంగా కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అవినీతిమయ పాలనతో ప్రజలు విసుగు చెందారన్నారు. వచ్చే ఎన్నికల్లో కారు టైర్లు పంక్చర్ కావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో బీజేపీ పవనాలు వీస్తున్నాయని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తామన్నారు.

◆ సూరారం డివిజన్ అధ్యక్షుడు దుర్యోధన్‌రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చండి శ్రీనివాస్, పత్తి రఘుపతి, సురేష్ గౌడ్, డివిజన్ ఇన్‌చార్జ్ రాజిరెడ్డి, సుశాంత్‌గౌడ్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజేష్ మిశ్రా, మహిళా మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యురాలు సంగీతా పాత్ర, నాయకులు సంతోష్ గుప్తా, సందీప్ గౌడ్, దీపక్ అంబేకర్, వేణు, నవీన్, నాగరాజు, సైదులు, వెంకటేష్ గౌడ్, పృథ్వీ, శంకర్ నాయక్, సరళా దేవి, శంకర్ గౌడ్, రఘు గౌడ్ తదితరులు ఉన్నారు.